## క్లుప్తంగా

### ఘనంగా పీఆర్ సర్కార్ జయంతి



ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో ప్రార్థనలు చేస్తున్న స్వామీజీలు, భక్తులు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు పాత డెయిరీ ఫారం దరి ఇందిరానగర్‌లోని ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో గురువారం పీఆర్ సర్కార్ బాబా 103వ జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలోని ఆశ్రమం సభ్యులు వేకువ జామున తరలివచ్చి సర్కార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భక్తి కీర్తనలతో భజన, ప్రార్థనలు, సామూహిక ధ్యానం చేశారు. ఈ సందర్భంగా స్వామీజీలు బాబా జీవిత చరిత్ర గురించి ఉపన్యసించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

### భూభౌతిక శాస్త్రంలో సులోచనకు డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం భూభౌతిక శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని సులోచన రాణి విన్నకోటకు డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు షేక్ కరీమున్నీసా బేగం మార్గదర్శకంలో తూర్పు కనుమలపై చేసిన పరిశోధనకు ఆమె డాక్టరేట్ సాధించింది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను సులోచన స్వీకరించారు.

### కపిలేశ్వరస్వామి పుష్పయాగానికి విశాఖ పూలు



విశాఖ పూలతో స్వామివారికి పుష్పయాగం నిర్వహిస్తున్న దృశ్యం

ఎంవీపీ కాలనీ: తిరుపతిలోని కపిలేశ్వరస్వామి పుష్పయాగానికి విశాఖ నుంచి వివిధ రకాల పూలు తరలివెళ్లాయి. విశాఖ సాగరతీర కార్తీక దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ పూలను తరలించారు. తొలుత ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపం వద్ద బుధవారం రాత్రి ఈ పూలకు సంకల్పం నిర్వహించి అనంతరం రైలులో తిరుపతి తరలించారు. గురువారం విశాఖ నుంచి తరలివెళ్లిన పూలతో స్వామివారికి పుష్పయాగం నిర్వహించారు. విశాఖ నుంచి కలువలు, తామరలు, తులసి, మల్లి ఇలా వివిధ రకాలకు చెందిన 10 వేల పూలను సేకరించి కపిలేశ్వరస్వామి పుష్పయాగానికి పంపించినట్లు కమిటీ ప్రతినిధి హిమాన్షు ప్రసాద్ తెలిపారు.

### ఘనంగా అన్నమాచార్యులు శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

బీచ్ రోడ్డు: తాళ్లపాక అన్నమాచార్యుల జయంతిని పురస్కరించుకుని శ్రీవెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్డులో గురువారం నిర్వహించిన శోభాయాత్ర ఘనంగా జరిగింది. సప్తగిరి సంకీర్తనలతో పాటు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని కోలాటం నిర్వహించారు. అనంతరం బీచ్‌రోడ్డులోని అన్నమాచార్యుల విగ్రహం వద్దకు ర్యాలీగా చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అన్నమయ్య విగ్రహానికి పూలమాలలు వేసి, అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



టీటీడీ నుంచి ఉషోదయ కూడలికి వెళ్లే మార్గంలో కనిపించని ఫుట్‌పాత్



టీటీడీ కల్యాణ మండపం ఆనుకుని ఫుత్‌పాత్‌పై ఏర్పాటు చేసిన దుకాణాలు

# ఫుట్‌పాత్‌లు మాయం.!

- ఎంవీపీలో వాణిజ్య దుకాణాలతో నిండిపోయిన మార్గాలు
- కన్నెత్తిచూడని జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు





ఏఎస్ రాజా సర్కిల్‌లో ఆక్రమణలో ఫుట్‌పాత్‌లు

ఎంవీపీ కాలనీ: భారీ ఎత్తున ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నాయి. పలువురు ఫుట్‌పాత్‌లపై యథేచ్ఛగా వ్యాపారాలు సాగించేస్తున్నారు. వ్యాపారాల పేరుతో కొందరు ఫుట్‌పాత్‌లు, రోడ్లను ఎంవీపీ కాలనీలో పలు చోట్ల ఆక్రమించేస్తున్నారు. కొన్ని చోట్ల పాదచారులు నడిచేందుకు వీలుగా రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన ఫుట్‌పాత్‌లు కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎక్కువయ్యాయి. ఇంత జరుగుతున్నా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**కూడళ్లలో అధ్వాన పరిస్థితులు**

ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా కూడలి, టీటీడీ కూడలి, ఎంవీపీ కూడలి, ఉషోదయ కూడలి ఇలా అన్ని చోట్ల ప్రస్తుతం అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. ఏఎస్ రాజా కూడలి నుంచి టీటీడీ కూడలి వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. ఏఎస్ రాజా కూడలిలో ఫుట్‌పాత్‌లపై టిఫిన్ షాపులను గతంలో తొలగించి పరిస్థితులను చక్కదిద్దారు. గత కొంత కాలంగా టౌన్‌ప్లానింగ్ విభాగం పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో మళ్లీ పరిస్థితులు దిగజారాయి. రెండు మూడు నెలలుగా ఈ ఫుత్‌పాత్‌లపై బడ్డీల సంఖ్య భారీగా పెరగడంతో పరిస్థితి మొదటికొచ్చింది. ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డులో రెండు వైపులా ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురయ్యాయి. టీటీడీ కూడలి నుంచి ఉషోదయ కూడలికి వెళ్లే మార్గంలోనూ ఫుట్‌పాత్‌లు కనిపించని పరిస్థితి నెలకొంది. టీటీడీ ఈ-దర్శన్, కల్యాణ మండపం చుట్టూ కొంత కాలంగా రోడ్డును ఆనుకొని, ఫుట్‌పాత్‌లపై షాపులు పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడంతో పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.

**గాలికొదిలేసిన టౌన్‌ప్లానింగ్**

జీవీఎంసీ రూ.కోట్లు ఖర్చు పెట్టి బ్యూటిఫికేషన్‌తో పాటు పాదచారులు నడిచేందుకు సిద్ధం చేసిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురవుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడంపై ఎంవీపీ కాలనీ వివిధ సెక్టార్ల నివాసితుల సంఘాల ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తెసుకెళ్లినా ఫలితం ఉండడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి ఫుత్‌పాత్‌ల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవడంతో పాటు రహదారుల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## జీవ వైవిధ్య పరిరక్షణతో ఆహార భద్రత



సదస్సును ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య జానకీరామ్

ఏయూ క్యాంపస్: జీవ వైవిధ్య పరిరక్షణతో ఆహార భద్రత సాధ్యపడుతుందని డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చరల్ యూనివర్సిటీ వీసీ ఆచార్య టి.జానకీరామ్ తెలిపారు. ఏయూ వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఒక రోజు జాతీయ సదస్సుఇంపాక్ట్ ఆఫ్ క్లైమేట్ చేంజ్ అండ్ ఎకో టూరిజం ఆన్ బయోడైవర్సిటీ సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అటవీ విస్తీర్ణం తగ్గిపోవడం, గ్రీన్ హౌస్ గ్యాస్‌ల ఉద్గారం పెరగడం పెను ముప్పుకు కారణంగా మారుతున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు, ప్రణాళికాయుతంగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి మాట్లాడుతూ జీవ సమతుల్యత దెబ్బతినకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి ప్రేమికులుగా ప్రతీ వ్యక్తి మారాల్సిన అవసరం ఉందన్నారు. సర్వప్రాణి సేవ భగవంతుని సేవగా నిలుస్తుందన్నారు. కర్బన ఉద్గారాలు పెరిగిపోవడం సముద్ర జీవులపై సైతం ప్రభావం చూపుతోందన్నారు. నేషనల్ బయోడైవర్సిటీ బోర్డ్ సభ్యుడు ఆచార్య హంచిలాల్ మాట్లాడుతూ ఉష్ణోగ్రతల్లో ఒక డిగ్రీ పెరుగుదల వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందన్నారు. ఆర్కిటిక్, అంటార్కిటిక్ ప్రాంతాలలో ఉష్ణోగ్రతల పెరుగుదల ప్రభావం, పర్యవసనాలను వివరించారు. ఏపీ బయోడైవర్సిటీ బోర్డ్ మెంబర్ సెక్రటరీ బి.వి.ఎ.కృష్ణమూర్తి మాట్లాడుతూ క్లైమేట్ చేంజ్ ప్రభావం జీడీపీపై ప్రభావం చూపుతుందన్నారు. పర్యాటకం పేరుతో జీవ వైవిధ్యం దెబ్బతినకుండా చూడాలన్నారు. జీవ వైవిధ్యం దెబ్బతింటే దారి ప్రభావం ప్రతీ జీవిపైన పడుతుందన్నారు. అనంతరం అతిథులను సత్కరించి, జ్ఞాపికలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, విభాగాధిపతి ఆచార్య కె.సంధ్య దీపిక, పలు ప్రాంతాలకు చెందిన ప్రతినిధులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విస్తృతంగా పోలీసుల 'కార్డెన్ సెర్చ్'



కార్డెన్ సెర్చ్‌పై సిబ్బందికి సూచనలిస్తున్న ఏసీపీ రాంబాబు



ఆటో రికార్డులు పరిశీలిస్తున్న ఏసీపీ, ఎంవీపీ సీఐలు

ఎంవీపీ కాలనీ: ద్వారకా జోన్ పోలీసులు ×కార్డెన్ సెర్చ్‌×ను గురువారం సాయంత్రం విస్తృతంగా నిర్వహించారు. విశాఖ ద్వారకా జోన్ ఏసీపీ రాంబాబు ఆధ్వర్యంలో ద్వారకా, ఆరిలోవ, ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్లకు చెందిన సీఐలు, ఎస్‌ఐలతో పాటు సిబ్బంది ఈ సెర్చ్ చేపట్టారు. జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో నేరాల నియంత్రణపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు పోలీసులు ఈ కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఎంవీపీ కాలనీ ఆదర్శనగర్‌లోని ప్రతి ఇంటిని పోలీసులు జల్లెడ పట్టారు. ఆయా ప్రాంతాల్లో నేరచరిత్ర ఉన్న వారి ఇళ్లను సైతం తనిఖీ చేసి మరణాయుధాలు, ఆయా వ్యక్తుల జీవన శైలిపై ఆరా తీశారు. వినియోగంలో ఉన్న కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా ఉన్న వస్తువులు, రికార్డులు లేని వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎంవీపీ కాలనీతో పాటు ఆరిలోవ, ద్వారకా పోలీసు స్టేషన్‌కు చెందిన సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

**ఆరిలోవలో పోలీస్ డ్రైవ్**



ఆరిలోవ డ్రైవర్స్ కాలనీలో పర్యటిస్తున్న పోలీసులు

ఆరిలోవ: ఆరిలోవ పోలీసులు రాత్రివేళ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. వాహనాలు తనిఖీలు చేసి అవసరమైన పత్రాలు పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి జీవీఎంసీ 11వ వార్డు డ్రైవర్స్ కాలనీలో ఆరిలోవ సీఐ జి.గోవిందరావు ఆధ్వర్యంలో పర్యటించారు. 103 ఇళ్ల ముందు నిలిపి ఉన్న వాహనాలను తనిఖీ చేశారు. వాటి యజమానుల నుంచి ఆ వాహనాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. రికార్డులు లేని 7 వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాటి రికార్డులు చూపించి వాహనాలు తీసుకువెళ్లాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాలు వాడకం, విక్రయాలు చేసేవారిని పట్టుకోవడానికి పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు సీఐ తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో విద్యుత్ లైన్ మరమ్మతులు జరగనుండడంతో శుక్రవారం పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. కైలాసగిరి తెలుగు మ్యూజియం 11 కేవీ, చలపతినగర్ 11 కేవీ, విమ్స్‌కు సంబంధించిన 11 కేవీ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనులు జరపనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాలాక్షినగర్ రెవెన్యూ కాలనీ, పోలీస్ క్వార్టర్స్, దయాల్‌నగర్, జోడుగుళ్లపాలెం, ఎస్సీ, ఎస్టీ కాలనీ, సంజీవినగర్, చలపతినగర్, వెటర్నరీ లేఅవుట్, ఫారెస్ట్ రోడ్డు, తదితర ప్రాంతాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

ఆరిలోవ: విద్యుత్ లైన్ మరమ్మతు పనులు జరగనుండడంతో శుక్రవారం 33/11 కేవీ ఆరిలోవ ఎస్ఎస్‌లో 11 కేవీ ఆరిలోవ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రవీంద్రనగర్, తోటగరువు, గాంధీనగర్, అన్నానగర్, బాలాజీనగర్, శ్రీహరినగర్, కైలాసనగర్, ముస్తఫా కాలనీ, సంతపాలెం, తదితర ప్రాంతాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

### 26న ఐఏఆర్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

మద్దిలపాలెం : ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ నెల 26న నిర్వహించనున్నామని ఐఏఆర్ఎఫ్ ప్రతినిధి నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలను డాక్టర్ ఎల్‌బీ కాలేజీ ప్రాంగణంలోని గాంధీ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. విశ్రాంత ఆచార్యుడు బాలమోహన్‌దాస్ అధ్యక్షతన ఈ వేడుకలు జరగనున్నాయన్నారు.

## వెంకన్న ఆలయంలో అన్నమయ్య సంకీర్తన



అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తున్న చిన్నారులు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో అన్నమయ్య సప్తగిరి సంకీర్తన ఆలాపన కార్యక్రమం గురువారం జరిగింది. సత్యరాజ్ సంగీతాలయ, నాట్యపరిమళ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీల సంయుక్త ఆధ్వర్యంలో 60 మంది చిన్నారులు సంగీతాలాపనతో అలరించారు. ఆయా సంస్థల ప్రతినిధులు డాక్టర్ వై.బాలగణేష్, వైపీ లిపికారెడ్డిల పర్యవేక్షణలో అన్నమయ్య గీతాలు ఆలపిస్తూ ఆకట్టుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏయూ మాజీ వీసీ ఆచార్య జీఎస్ఎన్ రాజు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్యరాజ్ సంగీతాలయ, నాట్య పరిమళ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీల ప్రతినిధులు బాలగణేష్, లిపికారెడ్డిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

### సిరులతల్లికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## చురుగ్గా కల్యాణ మండపం ఆధునికీకరణ



శిథిలమైన కల్యాణ మండపం



అదనపు భవనం కోసం జరుగుతున్న పనులు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు ఆరిలోవ కాలనీ ఆఖరి బస్ స్టాప్ వద్ద కల్యాణ మండపం ఆధునికీకరణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. సుమారు 12 ఏళ్ల క్రితం జీవీఎంసీ ఇక్కడ కల్యాణ మండపం నిర్మించింది. ఈ మండపం ఆరిలోవ కాలనీవాసులకు అందుబాటులో ఉండేది. మూడేళ్లుగా ఇది మూతపడింది. ప్రారంభం నుంచే దీనిలో సౌకర్యాలు లేకపోవడం, మొదటిలో భవన నిర్మాణం సరిగ్గా జరగకపోవడంతో పదేళ్లకే శిథిలావస్థకు చేరింది. దీంతో ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత కృషితో జీవీఎంసీ అధికారులు ఈ కల్యాణ మండపం ఆధునికీకరణకు రూ.60 లక్షల నిధులు కేటాయించారు. ఈ నిధులతో అదనపు భవనం నిర్మాణంతో పాటు వంటగది, విశ్రాంతి గదుల నిర్మాణం, పాత భవనం మరమ్మతులు చేపట్టి, అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు జీవీఎంసీ అధికారులు తెలిపారు. ఈ నిర్మాణం పూర్తయితే ఆరిలోవ కాలనీతో పాటు దుర్గాబజార్, నలభై గజాల కాలనీ, శ్రీకాంత్‌నగర్, టీఐసీ పాయింట్ వరకు ప్రజలకు ఉపయోగకరంగా ఉండనుంది.

## కమనీయం.. కల్యాణోత్సవం

- బల్లిగిరిలో ముగిసిన ఉత్సవాలు
- వైభవంగా సహస్ర ఘటాభిషేకం, చక్రస్నానం
- భక్తిశ్రద్ధలతో పూర్ణాహుతి



పాలు, పెరుగు, జలాలతో ఉత్సవ విగ్రహాలకు అభిషేకం చేస్తున్న అర్చకులు

అల్లిపురం : బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవాలు గురువారంతో ముగిసాయి. ఈనెల 18వ తేదీన స్వామి వారి తిరు కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఈ నెల 19వ తేదీన స్వామి వారి తిరు కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం ఉదయం అష్టోత్తర శత కలశస్నపనం, తిరుమంజనసేవ, వసంతోత్సవం, చక్రతీర్థం నిర్వహించారు. ఆలయ అర్చకుడు గొడవర్తి వీరరాఘవాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ మండపంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కలశాలలో నింపిన పాలు, పెరుగు, గంధం, పసుపు నీటితో శ్రీచక్రంతో పాటు ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకాలు, విశేష పూజలు, అభిషేకం నిర్వహించారు. ముందుగా పూర్ణాహుతి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా స్వామి వారికి భక్తి శ్రద్ధలతో చక్రస్నానం చేశారు. సాయంత్రం ధ్వజావరోహణం చేపట్టారు. ఈ సందర్భంగా భక్తుల గోవింద నామ స్మరణంతో బల్లిగిరి మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ, నక్షత్ర హారతి, సప్త హారతులు నిర్వహించారు.

**నేడు పుష్పయాగం..**

కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం పుష్పయాగం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయ్ తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి ఊంజల్ సేవ అత్యంత వైభవంగా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పాల్గొని తరించాలని ఆమె కోరారు.

### 3 నుంచి కథక్ నృత్యంలో శిక్షణ

మద్దిలపాలెం : అంతర్జాతీయ కథక్ నృత్య కళాకారిణి, కొరియోగ్రాఫర్ అనురేఖా గోష్ విశాఖ వేదికగా వచ్చేనెలలో 5 రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించనున్నామని నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు బత్తిన విక్రమ్ గౌడ్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 26వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటలకు కథక్ నృత్యంలో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. వర్క్‌షాపులో పాల్గొన్న ప్రతి ఒక్కరూ చివరి రోజున స్టేజ్‌పై నాట్యం చేసేలా శిక్షణ ఇస్తామన్నారు. 10 నుంచి 60 ఏళ్ల లోపు వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 98481 37445 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

## 5 శాతం సేవలు ఉచితంగా అందజేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : అన్ని స్కానింగ్ కేంద్రాల్లో 5 శాతం మంది పేదలకు ఉచిత సేవలు అందజేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆ వివరాలు ఎప్పటికప్పుడు తమకు అందజేయాలన్నారు. సంబంధిత అధికారులతో పకడ్బందీగా డెకాయ్ ఆపరేషన్స్ నిర్వహించాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని తెలిపారు. పురుషులతో సమానంగా స్త్రీల నిష్పత్తి పెంచాలని కోరారు. కేజీహెచ్ పిల్లల వైద్యుడు డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ 5 శాతం ఉచిత స్కానింగ్ సేవలు అర్హులైన పేదలకు అందుతున్నదీ లేనిదీ తనిఖీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో డిస్ట్రిక్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగదీశ్వరరావు, దిశ సీఐ జి.మల్లేశ్వరి, జీవీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషాప్రసాద్, జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, ఎన్‌జీవోలు సన్యాసిరాజు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



### 1న హనుమాన్ జయంతి



సీతమ్మధార: జూన్ 1న సీతమ్మధార కొండవాలు ప్రాంతంలోని 108 అడుగుల అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఎ.ఎస్.ఎన్.రాజు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి గణపతి పూజ, పుణ్యా హవచనం, వాస్తు పూజ, అస్త్రరాజార్చన, మహన్యాస పూర్వక మన్యుసూక్త పంచామృతభిషేకం, దశ సహస్ర సింధూర్చన, దశ సహస్ర నాగవల్లిదళ పూజలు, నీరాజన మంత్ర పుష్పములు, మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ ఆవరణలో మల్లిడి చక్రవర్తి, లక్ష్మి దంపతుల సౌజన్యంతో ప్రసాద వితరణ జరుగుతాయని చెప్పారు.

## చురుగ్గా బీసీజీ వ్యాక్సినేషన్



వృద్ధురాలికి జీసీజీ టీకా వేస్తున్న ఏఎన్ఎం

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులో బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం 60 ఏళ్ల వయసు దాటిన వారికి క్షయ వ్యాధి నివారణకు బీసీజీ టీకాలు వేశారు. గర్భిణులకు బలం చేకూరడానికి, రక్తం వృద్ధికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ టాబ్లెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం కృష్ణవేణి, ఆశ వర్కర్ భవానీ మాట్లాడుతూ వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండటంతో టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. గర్భిణులకు పలు సూచనలిచ్చారు.